క్లుప్తంగా

పచ్చదనం అభివృద్ధిలో భాగస్వాములు కండి



మొక్కకు నీరు పోస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు(అగ్రికల్చర్): విరివిగా మొక్కలు నాటి పచ్చదనం అభివృద్ధి చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం డీసీబీ బ్యాంకు లిమిటెడ్ కర్నూలు బ్రాంచీ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ బ్యాంకు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని బ్యాంకులు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద మొక్కలు నాటి పచ్చదనం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీబీ రీజినల్ హెడ్ బి.లక్ష్మినారాయణ, క్లస్టర్ హెడ్ హరిహర ప్రసాద్, స్థానిక బ్రాంచీ మేనేజర్ పి.బి.నాయుడు, ప్రిన్స్‌పల్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ యూనిటెడ్ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వీఆర్వోలు, సర్వేయర్లకు ఇచ్చిన మాదిరిగానే అదర్ ఆప్షన్‌లో ఎఫ్ఆర్ఎస్ వేసేటట్లు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని క్షేత్ర స్థాయి సిబ్బందికి వర్తిస్తున్న 35 క్యాజువల్ లీవ్‌లను తమకు వర్తింపజేయాలన్నారు. ఆరోగ్యం, వైద్యానికి సంబంధించిన పనులను మాత్రమే తమకు అప్పగించాలన్నారు. హెల్త్ సెక్రటరీలకు ప్రత్యేకంగా యూనిఫాం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరి, శ్రీగౌరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఆర్థిక నిర్వహణ తెలుసుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్ : విద్యార్థి దశ నుంచే ఆర్థిక నిర్వహణ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ ఏజీఎం రహిమాన్ అన్నారు. శుక్రవారం స్థానిక కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో రిజర్వు బ్యాంకు వారి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు 'ఆర్థిక స్వావలంబన డిజిటల్ బ్యాంకింగ్' గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏజీఎం రహిమాన్‌తో పాటు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు విద్యార్థులకు ఫైనాన్షియల్ లిటరసీ డిజిటల్ బ్యాంకింగ్ గురించి అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఎస్.అతిఫా, ఎం.అనిత, ఎస్.ఆస్మాలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఫైనాన్షియల్ లిటరీ ప్రోగ్రాం సీనియర్ కౌన్సిలర్ కె.రామలక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వెంకటరెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.సుగుణమ్మ, డి.ఆర్.గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ జయంతి

కర్నూలు (న్యూసిటీ) : బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి వేడుకలను శుక్రవారం కర్నూలులోని అంబేడ్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈడిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈ.రవిశంకర్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ పాపన్న గౌడ్ 17వ శతాబ్దంలో తెలంగాణలో భూస్వాములు, జమీందార్లు, మొగలాయిలకు వ్యతిరేకంగా పోరాడి దక్కన్ గడ్డపై బహుజన సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన తొలి పోరాట యోధుడన్నారు. బ్రాహ్మణవాదాన్ని కాదని పూజారులుగా మాల, మాదిగల వర్గాలకు చెందిన వారిని నియమించారని తెలిపారు. సాధారణ కల్లుగీసే కుటుంబంలో జన్మించి ఆధిపత్యకులాల అధికారాన్ని ధిక్కరించి దళిత బహుజనులను రాజ్యాధికారం వైపు నడిపించారన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, మాల మహానాడు నాయకులు వెంకటేశ్వర్లు, అనంతయ్య, అభిలాష్, అంజి, మౌలాలి, భీమ్‌రాజ్, విజయ్, పరుశురామ్, గోపాల్ గౌడ్, రామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని కల్లూరు ఎస్టేట్‌కు చెందిన వీరేష్‌కు ఇటీవల జ్వరం వచ్చింది. తను రెగ్యులర్‌గా వెళ్లే వైద్యుడు స్థానికంగా లేకపోవడంతో గాయత్రి ఎస్టేట్‌లోని ఓ డాక్టర్‌ను సంప్రదించాడు. పలు రకాల రక్తపరీక్షలు చేయించాడు. పనిలో పనిగా డెంగీ టెస్ట్ కూడా చేయించాడు. డెంగీ పాజిటివ్‌గా వచ్చిందని ఆసుపత్రిలో చేరాలని చెప్పాడు. ఎందుకైనా మంచిదని మళ్లీ వస్తానని చెప్పి వీరేష్ ప్రభుత్వ ఆసుపత్రికెళ్లి చికిత్స చేయించుకోగా అతనికున్నది సాధారణ జ్వరమేనని అక్కడి వైద్యులు తేల్చారు.

వీరిద్దరే కాదు ఇలా పలువురు జ్వరంతో ఆసుపత్రికి వెళితే డెంగీ పేరు చెప్పి భయపెడుతున్నారు. కొందరు వైద్యులు వివిధ రకాల పరీక్షలు చేయించి దోచుకుంటున్నారు.

కోడుమూరుకు చెందిన రాజేంద్ర వారం రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న ఓ ఆర్‌ఎంపీ వైద్యుడిని కలిశాడు. అతను వెంటనే నీకు డెంగీ జ్వరం వచ్చినట్లుగా ఉందని, కర్నూలులోని ఓ వైద్యుని పేరు చెప్పి తీసుకెళ్లాడు. కర్నూలులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అతడిని చేర్చుకుని వారం రోజుల పాటు చికిత్స అందించి ఇంటికి పంపించారు. ఫలితంగా అతనికి రూ.60 వేల దాకా ఖర్చు అయ్యింది. అక్కడి నివేదికలను తెలిసిన డాక్టర్‌కు చూపించడంతో నీకు డెంగీనే లేదని తేల్చి చెప్పాడు.

డెంగీ బూచి..కాసులు దోచి !

- జ్వరబాధితులను భయపెడుతున్న ప్రైవేటు ఆసుపత్రులు
- వివిధ రక్త పరీక్షల పేరుతో దోపిడీ
- పలు ఆసుపత్రులు, ల్యాబ్‌ల తప్పుడు నివేదికలు
- సాధారణ జ్వరానికీ డెంగీ చికిత్స
- ప్రతి జ్వరమూ డెంగీ కాదంటున్న వైద్యులు
- ఎలీసా టెస్ట్ ద్వారానే వ్యాధినిర్ధారణ



కర్నూలు(హాస్పిటల్):ఒకప్పుడు జ్వరం వచ్చిందంటే డాక్టర్లు మలేరియా కావచ్చు అనేవారు. ఇప్పుడు డెంగీ కావచ్చని చెబుతూ బెదరగొడుతున్నారు. సీజన్ మారిందంటే చాలు జ్వరాలు రావడం సాధారణం. జ్వరం వచ్చి ఆసుపత్రికి వెళితే ఒకేసారి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు మూకుమ్మడిగా రాస్తున్నారు. ఎలీసా పరీక్షలో నిర్ధారణ అయితేనే డెంగీగా భావించాలని అధికారులు చెబుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

కర్నూలు జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 అర్బన్‌హెల్త్ సెంటర్లు, 5 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, రెండు ఏరియా ఆసుపత్రులు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఉన్నాయి. వీటితో పాటు 150కి పైగా రిజిస్టర్డ్ ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. అత్యధికంగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోనిలలో ఏర్పాటు చేశారు. ఎక్కువ శాతం మంది జ్వరం వస్తే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తున్నారు. రెండు, మూడు రోజులైనా తగ్గకపోతే స్థానిక ఆర్‌ఎంపీలను సంప్రదిస్తున్నారు. వారి సూచనలు, సిఫారసులతో కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రులకు, వైద్యుల వద్దకు వెళ్తున్నారు. ఇలా ఒక్కో రోగిని ప్రైవేటు ఆసుపత్రికి తెచ్చినందుకు గాను ఆర్‌ఎంపీలకు 40 నుంచి 60 శాతం కమీషన్ ముడుతోంది. ప్రైవేటు ఆసుపత్రులు వారి వద్దకు వచ్చిన రోగికి ఏ‌లాంటి జ్వరం ఉందో లక్షణాలను బట్టి తెలిసిపోతుంది. కానీ జ్వరం అని వచ్చిన రోగికి దాదాపు రూ.3 వేలు విలువజేసే వివిధ రకాల వైద్యపరీక్షలను వైద్యులు చేయిస్తున్నారు. ఇలాంటి చికిత్సలు అందించడంలో గాయత్రి ఎస్టేట్, కొత్తబస్టాండ్, ఎన్‌ఆర్ పేటలోని పలువురు వైద్యులు, ప్రైవేటు ఆసుపత్రులు దోపిడీ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

కర్నూలు,ఆదోనిలలో డెంగీ నిర్ధారణ పరీక్ష

డెంగీ పరీక్ష నిర్ధారణ కోసం మొదట ర్యాపిడ్ కిట్ మెథడ్ టెస్ట్ చేస్తారు. అందులో పాజిటివ్ వస్తే రక్తన మూనాలను కర్నూలు మెడికల్ కాలేజిలోని మైక్రో బయాలజి ల్యాబ్, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తారు. డెంగీగా నిర్ధారణ అయితే సదరు ఆసుపత్రికి సమాచారం అందిస్తారు. వ్యాధి లక్షణాలను బట్టి వైద్యులు రోగికి చికిత్స అందిస్తారు. కానీ ర్యాపిడ్ కిట్‌లో వచ్చిన నివేదికల ఆధారంగా ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు అధిక శాతం డెంగీగా భావించి చికిత్స చేస్తున్నారు. అవసరం లేకపోయినా రక్తం, రక్తకణాలు ఎక్కిస్తున్నారు. ఆసుపత్రిలో చేర్చుకుని పలు రకాల పరీక్షలు, మందులు రోగికి ఎక్కిస్తున్నారు. దీనివల్ల రోగికి మోయలేని ఆర్థిక భారం అవుతోంది.

డెంగీ ఎలా సోకుతుందంటే...!

ఏడిస్ ఈజిప్టి అనే దోమకాటు వల్ల డెంగీ సోకుతుంది. ఈ దోమ ఒంటిపై నల్లటి, తెల్లటి చారలు ఉంటాయి. అందుకే దీనిని పులిదోమ అని కూడా అంటారు. ఇది శుభ్రమైన, నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడుతుంది. ఇది కేవలం రెండు వారాలు మాత్రమే జీవిస్తుంది. ఇది తన జీవితకాలంలో మూడుసార్లు మాత్రమే గుడ్లు పెడుతుంది. ప్రతిసారి వంద గుడ్లు పెడుతుంది. ఈ దోమలు ఇంట్లో బట్టలు, పరుపులు, కర్టన్స్ వెనుక దాక్కుంటాయి. ఈ నేపథ్యంలో ఇంటిని , ఇంటి పరిసరాలను ప్రతిరోజు శుభ్రంగా ఉంచుకోవాలి.

డెంగీ వ్యాధి లక్షణాలు

తీవ్రమైన తలనొప్పి, కళ్లు, కండరాలు, కీళ్లనొప్పులు ఉంటాయి. ఒంటిపై ఎర్రటి దురదలు కనిపిస్తాయి. ముక్కు, చిగుళ్లల్లో రక్తం స్రవిస్తుంది.

ఎలీసా టెస్ట్ ద్వారానే డెంగీ నిర్ధారణ



కర్నూలు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే డెంగీ వ్యాధి నిర్ధారణకు ఎలీసా టెస్ట్ చేస్తున్నారు. అక్కడ డెంగీ నిర్ధారణ అయితేనే చికిత్స చేయాలి. ఈ వ్యాధికి ప్రత్యేకంగా చికిత్స లేదు. రోగి లక్షణాలను బట్టి వైద్యులు చికిత్స అందిస్తారు. కాకపోతే డెంగీ నిర్ధారణ అయిన కేసు ఇంటితో పాటు చుట్టుపక్కల 50 ఇళ్లలో దోమల నిర్మూలన చర్యలు తీసుకునేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. ఈ మేరకు మలేరియా విభాగం ద్వారా పంచాయతీ, మున్సిపల్ శాఖలతో కలిసి చర్యలు తీసుకుంటున్నాము.

–నూకరాజు, మలేరియా అధికారి, కర్నూలు

భక్తి శ్రద్ధలతో శ్రావణ పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి ఆలయం, లలితా పీఠం, రాజరాజేశ్వరీ దేవి ఆలయం, సప్తగిరి చౌడేశ్వరీ దేవి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ఆరు వేల రోజా పూలతో అర్చన, రాహుకాల పూజ, లలితా సహస్రనామ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ అధికారులు చేపట్టనున్న అభివృద్ధి పనుల కారణంగా కింగ్ మార్కెట్, చేపల మార్కెట్, ఖల్లా వీధి, మద్దా వీధి, జామియా మసీదు, విద్యా నగర్, గాంధీ నగర్, హబీబ్ ముబారక్ నగర్, పింఛి మిషన్ ఏరియా, బంగి అనంతయ్య కాలనీ, సంపత్ నగర్, మహవీర్ నగర్, చల్లావారి వీధి, తిలక్ నగర్, ఆర్టీసీ కొత్త బస్టాండ్, ఇందిరా గాంధీ నగర్, కల్లూరు రోడ్డు, పెద్దపాడు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



జేసీఎస్ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- సచివాలయ జేసీఎస్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో జగనన్న సచివాలయ కన్వీనర్లు, వార్డు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారికి మేలు చేకూర్చే పథకాల గురించి వివరించాలన్నారు. ముఖ్యంగా ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి జగనన్న ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకోవాలన్నారు. ప్రతిపక్ష నాయకులు చేసే అసత్య ఆరోపణలు, విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. ప్రతి కన్వీనర్ తనపరిధిలోని గృహాలను తరచూ సందర్శిస్తూ 2019 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు, వాటి వల్ల కలిగిన లబ్ధిని వివరించాలన్నారు.ప్రతిఒక్కరూ జేసీఎస్ సైన్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో తమ వివరాలు పొందుపరచాలన్నారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు జేసీఎస్ కన్వీనర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, నాయకులు సీహెచ్ మద్దయ్య, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పేదల బతుకుల్లో వెలుగు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల బతుకుల్లో వెలుగులు నింపాయని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక 45వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కప్పల్‌నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర ద్వారాం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి వర్గాన్ని కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారని చెప్పారు. అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరించడంతో పాటు పేదల ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్‌రెడ్డి, షేక్, ఇర్ఫాన్, సాధిక్, జోషి, చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25 నుంచి సాంఘిక నాటకోత్సవాలు



నాటకోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: కళావిపంచి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు సాంఘిక నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహరావు, ముఖ్య సలహాదారుడు డి. రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో నాటకోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళా విపంచి 17 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వై.కె.నాగేశ్వరరావు స్మారక నాటకోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ముగ్గురు ప్రముఖులకు స్మారక పురస్కారాలు ప్రదానం చేస్తున్నామన్నారు. 25వ తేదీ వై.కె.నాగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని కర్నూలుకు చెందిన నందిఅవార్డు గ్రహీత గోపి శెటి వెంకటేశ్వర్లుకు, డీఎస్ దీక్షిత్ స్మారక పురస్కారాన్ని పొన్నూరుకు చెందిన ప్రముఖ నాటక, సినీ రచయిత, నటులు కృష్ణేశ్వరరావుకు, జి.ఎల్.ఎస్.మూర్తి స్మారక పురస్కారాన్ని హైదరాబాద్ కళ పత్రిక ఎడిటర్ మహమ్మద్ రఫీకి ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళావిపంచి ప్రధాన కార్యదర్శి జి.వి.జి. శంకర్, కళాక్షేత్రం కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు సంగా ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యుత్ పనులు వేగవంతం చేయండి

కర్నూలు(రాజ్‌విహార్): జగనన్న కాలనీల్లో చేపడుతున్న విద్యుత్ పనులు వేగవంతం చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యుత్ సబ్‌స్టేషన్లతో పాటు ఇతర అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.

దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి



చిన్నారి తల్లికి సూచనలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

కర్నూలు(హాస్పిటల్): కాలనీల్లో దోమలు పెరగకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక డాక్టర్ కాలనీలోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న అరోరానగర్ సచివాలయంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు గృహ సందర్శనాలు చేసి నీటి నిల్వలు లేకుండా అవగాహన కల్పించి దోమల పెరుగుదల అరికట్టేలా చూడాలన్నారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహాలక్ష్మి, కార్పొరేటర్ మొహిద్దీన్, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పోషకాహార పునరావాస కేంద్రం తనిఖీ

పెద్దాసుపత్రిలోని చిన్నపిల్లల విభాగంలో ఏర్పాటు చేసిన పోషకాహార పునరావాస కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, మెనూ పరిశీలించారు. అక్కడ ఉన్న తల్లులతో పిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి చర్చించారు. ఆరోగ్య సిబ్బంది సమయానుసారంగా పిల్లలకు ఇవ్వాల్సిన పోష్టికాహారం, ఆరోగ్య సేవలపై సూచనలు చేశారు.

టార్పాలిన్లను గుట్టుగా అమ్మేశారు

- మార్కెట్‌యార్డులో వెలుగుచూసిన దందా
- టార్పాలిన్లు బయట అమ్మి సొమ్ము చేసుకున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది
- విచారణలో వెలుగు
- నిఘాలేని జేఎంఎస్ నరసయ్యకు మెమో జారీ
- మధునూధన్‌రెడ్డి, మరో ఇద్దరు తాత్కాలికంగా సస్పెండ్



మార్కెట్ యార్డు కమిటీ కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్):మార్కెట్ యార్డులో విక్రయానికి రైతులు పంట ఉత్పత్తులు తీసుకొస్తుంటారు. హఠాత్తుగా వర్షం పడితే అవి తడిసిముద్దయితాయి. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఈ పరిస్థితి తలెత్తకుండా వర్షం పడేటప్పుడు పంట ఉత్పత్తులను కప్పేందుకు కర్నూలు మార్కెట్‌యార్డు అధికారులు తెప్పించిన టార్పలిన్లను అదే యార్డులో పని చేసే కొందరు గుట్టుగా విక్రయించారు. ఒకటి కాదు...రెండు కాదు... ఏకంగా 45 టార్పాలిన్లను మార్కెట్ యార్డు నుంచి బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇటీవల మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు యార్డులో తిరుగుతున్న సమయంలో ఈ విషయం వెలుగుచూసింది. అవుట్ సోర్సింగ్‌పై పని చేసే ఇద్దరు సెక్యూరిటీలు టార్పాలిన్‌లను బయటకు పంపి అమ్ముకున్నారని కొందరు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. లోతుగా ఆరా తీయగా 45 టార్పాలిన్లు అమ్మేసుకున్నట్లు నిర్ధారణ అయింది. సాధారణంగా టార్పాలిన్లు జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్ కంట్రోల్‌లో ఉంటాయి. ఆయన పట్టించుకోకుండా ఉన్నందుకు జేఎస్ఎస్ నరసయ్యకు మెమో జారీ చేశారు. అలాగే టార్పాలిన్లను బయటకు తరలించి అమ్ముకోవడంతో కీలకంగా వ్యవహరించిన సెక్యూరిటీ మధుసూదన్ రెడ్డితో పాటు మధు అనే మరో సెక్యూరిటీ, కృపాకర్ అనే ట్రాక్టర్ డ్రైవర్‌కు నోటీసులు ఇచ్చి తాత్కాలికంగా మూడు రోజుల పాటు సస్పెండ్ చేసి బయటికి పంపారు. నోటీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత వారిపై తీవ్రమైన చర్యలు ఉంటాయని సెక్రటరీ గోవిందు తెలిపారు. కాగా గుట్టుగా టార్పాలిన్లను అమ్మేసుకున్న సెక్యూరిటీ సిబ్బంది.. డబ్బు వెనక్కి కడుతాము... మాపై కఠిన చర్యలు వద్దంటూ పైరవీ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పాలక వర్గం గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఈ సెక్యూరిటీ సిబ్బంది అక్రమాలు వెలుగులోనికి రానివి అనేకం ఉన్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కన్నప్ప సత్రంకు రూ.70 లక్షలు మంజూరు

కర్నూలు కల్చరల్: కన్నప్ప సత్రంకు కామన్ గుడ్ ఫండ్ కింద రూ.70 లక్షలు మంజూరయ్యాయని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని కన్నప్ప సత్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. సీజీఎఫ్ రూ.70 లక్షలకు మ్యాచింగ్ గ్రాంట్ 20 శాతం దాతల నుంచి సేకరించి కల్యాణ మండపం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఈఓ హనుమంతరావుకు సూచించారు. సత్రం పక్కనున్న పాతబడిన ఇళ్లను పరిశీలించి వాటిని శుభ్రం చేయించి దేవాలయానికి ఉపయోగ పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏసీతో పాటు ఈఓ హనుమంతరావు ఉన్నారు.

పనిసర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలి

కర్నూలు కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం పనిసర్దుబాటు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, కర్నూలు జిల్లా ఫ్యాక్టరీ చైర్మన్ సెక్రటరీ జనరల్ ఎస్.గోకారి, జి.తిమ్మప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈఓ రంగారెడ్డిని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి మాట్లాడారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలకు డీఈఓ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్టీయూ నుంచి జనార్ధన్, యూటీఎఫ్ నుంచి జయరాజు, ఏపీటీఎఫ్ 1938 నుంచి ఇస్మాయిల్, మరియానందం, ఏపీటీఎఫ్ 257 నుంచి రంగన్న, హెచ్ఎంఏ నుంచి నారాయణ, శ్రీనివాసయాదవ్, ఆప్టా నుంచి సేవానాయక్, బీటీఏ నుంచి సుధాకర్, శ్రీధర్, గోవింద్ పాల్గొన్నారు.

సిటీ బస్సులు నడపాలి

కల్లూరు: కర్నూలు నగరంలో సిటీ బస్సులు నడపాలని బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ కొట్టె చెన్నయ్య శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు నగర జనాభా ఆరున్నర లక్షలు దాటిందని ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయిందని పేర్కొన్నారు. 1990 సంవత్సరంలోనే నగరంలో సిటీబస్సులు నడిపారని గుర్తుచేశారు.

ఎంటీఎస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్)తో పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని జేఏసీ రాష్ట్ర నాయకుడు బెంజిమన్ డిమాండ్ చేశారు. అలాగే ఎన్ఎంఆర్, పార్ట్‌టైం, కంటింజెంట్ సర్వీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కూడా రెగ్యుల్ చేయాలని కోరారు. శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బెంజిమన్ మాట్లాడుతూ.. 1993 నుంచి ఎంతో మంది ఉద్యోగులు వివిధ సర్వీసుల్లో చాలీచాలనీ జీతాలతో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తమ ఏకైక డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, నగర మేయర్ బీవై రామయ్య
- 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం
- ప్రజల్లో అపూర్వ స్పందన

కల్లూరు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిలో సువర్ణాధ్యాయాన్ని లిఖించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య కోరారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు సోమిశెట్టి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ కాలనీలో విస్తృతంగా పర్యటిస్తూ, సంక్షేమ పథకాలను వివరిస్తు బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీలో ఎమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి

ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గత నాలుగేళ్లుగా జరిగిన అభివృద్ధి, సంక్షేమమే తమ ఆయుధాలుగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. నగరంలోని 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతరో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.

దిగ్విజయంగా కార్యక్రమం

నగరంలోని 19వ వార్డులో రెండు వారాలుగా జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా ముగియడంతో వార్డులోని వైఎస్సార్‌సీపీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి వచ్చిన విశేష స్పందనతో ప్రతిపక్ష నాయకులు చేసినవన్నీ అవన్నీ అసత్య ఆరోపణలే అని తేటతెల్లమైందన్నారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు హనుమంతురెడ్డి, శివరాం, బాలచంద్రరెడ్డి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలయాల ఆస్తులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

కర్నూలు కల్చరల్: దేవాలయాల ఆస్తులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని దేవదాయశాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం జొహరాపురం నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం సర్వే నెం. 123-ఏకు చెందిన 7-72 సెంట్ల భూమిని కొంత మంది ఆక్రమించుకున్నట్లు తమ దృష్టికి రావడంతో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చామన్నారు.